
సాక్షి ఒడిశా

ఆదివారం । 2 । మార్చి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,09,079
- భువనేశ్వర్/పూరీ



హాట్ఎయిర్ బెలూన్ సేవలు
కొరాపుట్‌లో హాట్ ఎయిర్‌బెలూన్ సేవలు రానున్నాయి. ఏర్పాట్లు చేస్తున్నారు.
- 8లో.



సుభద్రశక్తి మేళా ప్రారంభం
మల్కన్‌గిరిలో సుభద్ర శక్తిమేళా ప్రారంభమైంది. స్టాల్స్ ఆకట్టుకున్నాయి.
- 8లో.

న్యూస్‌రీల్

లక్ష్మీపూర్‌లో భ్రుగుభక్షి పాత్రో పర్యటన



లక్ష్మీపూర్ వద్ద భ్రుగు భక్షిపాత్రోకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభు జానీ, బీజేడీ కార్యకర్తలు

కొరాపుట్: ప్రతిపక్ష బిజూ జనతా దళ్ పార్టీకి చెందిన ప్రత్యేక పరిశీలకుడు భ్రుగుభక్షిపాత్రో కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ నియోజకవర్గంలో పర్యటించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బ్రహ్మపుర పార్లమెంటరీ స్థానం నుంచి ఆయన పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం పార్టీ ఆయనకు లక్ష్మీపూర్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. తొలి సారిగా భ్రుగు రాక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రభు జానీ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు ఘనం స్వాగతం పలికారు.

ఉత్సాహంగా మహిళల కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న మహిళలు

రాయగడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని గుడారి అంగన్‌వాడీ కార్యాలయంలో సీడీపీవో అనిత పాణిగ్రాహి ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం ప్రారంభమైన పోటీలు శనివారం కూడా కొనసాగాయి. పోటీల్లో భాగంగా మిషన్ శక్తి బీపీసీ సునీల్ కుమార్ మిశ్రో పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో అగన్‌వాడీ కార్యకర్తల జట్టు విజయం సాధించింది. ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ తరహా పోటీలను నిర్వహించి మహిళల్లో ఆత్మ స్థైర్యంతో పాటు ఉత్సహాన్ని నింపుతున్నామని సీడీపీవో అనిత తెలిపారు.

నారాయణ పట్నలో కొరాపుట్ జెడ్పీ ప్రెసిడెంట్ పర్యటన



నారాయణ పట్నలో బీజేడీ కార్యకర్తలతో కొరాపుట్ జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నారాయణ పట్న సమితి కేంద్రంలో కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక పర్యటించారు. శనివారం నియోజకవర్గంలో బిజూ జనతాదళ్ సీనియర్ కార్యకర్తల నివాసాలకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అధికారంలో లేదని చింత వద్దని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా పరిషత్‌స్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఏ సహకారం అవసరమున్నా తనను సంప్రదించాలని సస్మితా మెలక అభయం ఇచ్చారు.

ఇద్దుడి మామిడితోటలో మృతదేహం

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ బూదర పంచాయతీ ఇద్దుడి గ్రామంలో మామిడితోటలో శనివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మృతదేహం స్థానికులకు కనిపించింది. వారు వెంటనే కాశీనగర్ పోలీసులకు ఫోన్ చేశారు. సంఘటన స్థలానికి కాశీనగర్ పోలీసు స్టేషన్ అధికారి సునీల్ కుమార్ బెహరా విచ్చేసి చనిపోయిన వ్యక్తి శవాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్రాస్పత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తి వివరాలు కాశీనగర్ ఐఐసీ బెహరా సేకరిస్తున్నారు. కేసును కాశీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంతవరకూ మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు.

విత్తన వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

- జయపురంలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహణ
- దేశీయ విత్తనోత్పత్తికి పాటు పడాలని వక్తల పిలుపు



ప్రసంగిస్తున్న ఒడిశా రాష్ట్ర వ్యవసాయం, రైతు సహస్తీకరణ విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద పాఢి



పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించిన ఆదివాసీ మహిళా రైతులు

జయపురం: వ్యవసాయ వైజ్ఞానికుడు ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి, ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కేంద్రం ఒడిశాలో ఏర్పాటు చేసి 30 ఏళ్లు గడిచిన సందర్భంగా జయపురంలోని ఎంఎస్ఎస్ఎఫ్‌'పూల్‌బెడలో 'ఆహారం.. పుష్టికర సురక్ష విత్తన పద్ధతి'పై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. రెండు రోజులుగా ఇది కొనసాగుతోంది. ఈ వర్క్‌షాపులో విత్తనాలపై పరిశోధనలు, సంప్రదాయ విత్తనాల పరిరక్షణకు కమ్యూనిటీ విత్తనం ఆవశ్యకత, స్థానిక భూమి సంరక్షణ, దేశీ విత్తన సంరక్షణ, దక్షత, విస్తరణ కార్యక్రమాల్లో మహిళలు, యువతను మమేకం చేయడం, రానున్న రోజుల్లో దేశీయ విత్తనాలను అధికోత్పత్తి చేయించి రైతులకు అందించడంపై చర్చించారు. ఈ వర్క్‌షాపులో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ, ఆదివాసేతర, సంప్రదాయ పరిరక్షణ రైతులు, వ్యవసాయ పరిశోధకులు, వైజ్ఞానికులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒడిశా రాష్ట్ర వ్యవసాయం, రైతు సహస్తీకరణ విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద పాఢీ కూడా పాల్గొన్నారు. ఆయన ముందుగా మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కమల పూజారిలు కొరాపుట్‌కు వ్యవసాయ రంగంలో పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారని కొనియాడారు. వ్యవసాయ రంగానికి అమూల్య సేవలు అందిస్తున్న ఎం.ఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రశంసించారు. విత్తన వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభావ శీలి 5ఎస్ నీతి నియమాలను అధిగమించాలన్నారు.

ఎం.ఎస్.ఎస్ఆర్ ఎఫ్ జయపురం డైరెక్టర్ ప్రశాంత పరిడ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాపులో ప్రముఖ వైజ్ఞానికులు డాక్టర్ ఆలిబర్ కింగ్, ఎమ్.ఎస్.ఎస్ఆర్ ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సౌమ్య స్వామినాథన్, ఐసిఆర్ఐఎస్ఎటి జీన్ బ్యాంక్ చీఫ్ డాక్టర్ కులదీప్ సింగ్, డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, శాలినీ భుటాని(న్యూఢిల్లీ), దిలీప్ రాయ్ చౌధురి, డాక్టర్ డి.తారా సత్య భటి, కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ తదితరులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో ఒడిశాలో 30 ఏళ్ల ప్రయాణంలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ రైతులతో పాటు మండియ రాణి డాక్టర్ రొయిమతి ఘివురియను సన్మానించారు. రాగులు చిరు ధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను మహిళలు ప్రదర్శించారు. దేశీ విత్తన పంటిని మండియ రాణి రొయిమతి ప్రారంభించారు.



కమ్యూనిటీ దేశీ విత్తన పంటిని ప్రారంభిస్తున్న మండియ రాణి రోయిమతి ఘివురియ



ఒడిశాలో 30 ఏళ్ల ప్రయాణంలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అతిథులు



మండియ రాణి డాక్టర్ రొయిమతి ఘివురియను సన్మానిస్తున్న డాక్టర్ సౌమ్య స్వామినాథన్

29న బార్ అసోసియేషన్ ఎన్నికలు

రాయగడ: రాయగడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 29 వ తేదీన జరగనున్నాయి. ఇందుకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, కార్యదర్శి తదితర విభాగాల ఎన్నికల అధికారిగా న్యాయవాది జగన్నాథ దొర నియమితులయ్యారు. ఈ మేరకు జరిగిన రాయగడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకూ నామినేషన్ల దాఖలు, తొమ్మిదో తేదీన నామినేషన్ల పరిశీలన, 12న ఉపసంహరణ, 13న ఎన్నిల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించే దొర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైతే 29వ తేదీన ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

రక్తదానం చేసి.. ఆదర్శంగా నిలిచి..



రక్తదానం చేస్తున్న అమరేంద్రనాథ్

రాయగడ: అత్యవసరంగా రక్తం అవసరమైన అనాథ వృద్ధురాలికి దివ్యాంగుడు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ అనాథ వృద్ధురాలు అనారోగ్యంతో చికిత్సపొందుతుంది. ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న దివ్యాంగుల మహాసంఘం జిల్లా కార్యదర్శి అమరేంద్రనాథ్ శనివారం ఆస్పత్రికి వెళ్లి రక్తాన్ని దానం చేసి ప్రశంసలు పొందారు.

వేసవిని ఎదుర్కొనేందుకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు. గజపతి జిల్లాలో ఫిబ్రవరి నుంచే భానుడి ప్రభావం కనిపించింది. వేసవి ప్రభావం, వడదెబ్బలపై ముందస్తు చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ కలెక్టరేట్ హాల్–1లో శనివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రభుత్వ బడులు, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల పనివేళల మార్పు, శ్రామికవర్గానికి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకూ విరామం, పట్టణంలో అన్ని కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు, వేసవిపై ప్రచారం చేపట్టం వంటివి చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఆదనపు కార్యనిర్వాహణాధికారి (డీఆర్‌డీఏ) పృథ్వీరాజ మండళ్, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, జిల్లా ఎమెర్జెనీ అధికారి కమలకాంత పండా పాల్గొన్నారు.

'భ్రమర ప్రేమ్' కవితా సంపుటి ఆవిష్కరణ

పర్లాకిమిడి: స్థానిక ఉత్కళ హితేషినీ సమాజ్ భవనంలో కవి, వ్యాసకర్త, నటుడు శుభ్రాంశు శేఖర్ పట్నాయిక్ రచించిన 'భ్రమర ప్రేమ' కవితా సంపుటిని శనివారం ముఖ్య అతిథి, ఉపాంతప్రహరి పూర్ణ చంద్ర మహాపాత్రో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, బినోద్ చంద్ర జెన్నా, సంపాదకులు ద్విజెన్ పాఢి, మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కళ్యాణీ మిశ్రా, ఒడిషా సాహిత్య అకాడమీ మాజీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, మనోజ్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంపాదకులు ద్విజెన్ పాఢి మాట్లాడుతూ, శుభ్రాంశు శేఖర్ పట్నాయిక్ ఒక కవి, రచయిత, క్రీడాకారుడు, నటనాశక్తి వున్న బహుముఖ కళాకారులని కితాబు నిచ్చారు. రచయిత శుభ్రాంశు శేఖర్ పట్నాయిక్ కవితా సంపుటిపై పలువురు వక్తలు మాట్లాడారు.

హత్య కేసులో సవ్యసాచి నిర్దోషి

- గుణుపూర్ ఎస్‌డీజేఎం కోర్టు తీర్పు

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు సవ్యసాచి పండాను గుణుపూర్ ఎస్‌డీజేఎం కోర్టు జడ్జి సంతోష్ మహాపాత్రో నిర్దోషిగా తీర్పునిచ్చారు. కోర్టులో ప్రవేశ పెట్టిన సాక్ష్యులను విచారించిన ఆయన ఈ మేరకు తుది తీర్పును ప్రకటించినట్లు ఆయన తరపు వాదిస్తున్న న్యాయవాది బ్రహ్మానంద పట్నాయక్ తెలియజేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాల్లోకి వెళితే .. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల రామనగుడ సమితి బిరుబాయి వద్ద 2006లో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ సమయంలో అమాయకుడైన ఒక ఆదివాసీ తూటాలకు గురై ప్రాణం కోల్పోయాడు. దీనికి సంబంధించి పోలీసులు మావో నేతగా గుర్తింపు పొందిన సవ్యసాచి పండాపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణకి రావడంతో జడ్జి 12 మంది ప్రత్యక్ష సాక్షులతో పాటు మరో అయిగురు గ్రామస్తులను విచారించిన అనంతరం శుక్రవారం సవ్యసాచిని నిర్దోషిగా తీర్పునిచ్చారు.



సవ్యసాచితో న్యాయవాది బ్రహ్మానంద పట్నాయక్

మృతి కేసులో నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు



కాలువలో సింహ్ మృతదేహం (ఫైల్)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల అచవ గ్రామ సమీపంలో ఒక కాలువాలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న ఘటనలో.. గుణుపూర్ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టయిన వారిలో ప్రమోద్ కుమార్ మహాపాత్రో, జస్వాల పూజారి, దీపక్ కుమార్ పాణిగ్రహి, అజయ్ కుమార్ మహాపాత్రో, ప్రమోద్ మహాపాత్రో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గత నెల ఫిబ్రవరి 22న బీహార్ రాష్ట్రానికి చెందిన సాను సింహ్ అనే యువకుని మృతదేహాన్ని అచవా గ్రామ సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేశారు. ఫిబ్రవరి 21న సోనుసింహ్‌తో పాటు ప్రమోద్ కుమార్ మహాపాత్రో, జజ్వాల పూజారి, దీపక్ కుమార్ పాణిగ్రహి, అజయ్ కుమార్ మహాపాత్రో, ప్రమోద్ మహాపాత్రోలు గుణుపూర్ సమితిలో గల కుజేంద్రి వద్ద పడి ఉన్న విద్యుత్ తీగలను దొంగిలించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ కారణంగా సాను సింహ్ గాయాలపాలయ్యాడు. అతడిని తీసుకెళ్తున్న సమయంలో మృతి చెందాడు. అనంతరం నిందితులు ఐదుగురు అతని మృతదేహాన్ని అచవా గ్రామ సమీపంలో గల ఒక కాలువలో పడేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు గ్రామస్తులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

ది గోట్ లైఫ్

- ఇదో తరహా 'ఆడు జీవితం' కథ..
- 20 ఏళ్లుగా తమిళనాట మగ్గిపోతున్న ఓ వృద్ధుని కన్నీటిగాథ
- గొర్రెల కాపరిగా వెట్టిచాకిరీ
- ఇటీవలే బంధవిముక్తి
- కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం అక్కడి వారి ప్రయత్నం
- పార్వతీపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్న అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం: కుటుంబ పోషణ కోసం గల్ఫ్ దేశాలు వెళ్లి.. ఏజెంట్ చేతిలో మోసపోయి, అక్కడ అరబ్బుల చేతిలో చిత్రవధకు గురైన ఓ నజీబ్ కథ... ది గోట్ లైఫ్ (ఆడు జీవితం). ఓ నవల ఆధారంగా ఇటీవల విడుదలైన ఈ చిత్రం ప్రతి ఒక్కరినీ కదిలించింది. కథలో కొద్దిగా మార్పులున్నా.. అటువంటి పరిస్థితినే అనుభవించాడు అప్పారావు అనే ఓ వ్యక్తి. ప్రస్తుతానికైతే అతనిది పార్వతీపురంగానే చెబుతున్నాడు. పేరు, ఊరు అయితే గుర్తుంది గానీ.. అంతకుమించి వివరాలేవీ చెప్పలేకపోతున్నాడు. దీంతో స్వస్థలానికి తిరిగి చేరుకోలేకపోతున్నాడు. ఇటీవలే తమిళనాట వెట్టి చాకిరీ నుంచి బంధవిముక్తుడైన అతని కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

కార్మిక శాఖాధికారుల చొరవతో బంధవిముక్తి..

అక్కడి జిల్లా కార్మిక సంక్షేమ శాఖ అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా కొద్దిరోజుల కిందట కదంబంకుళం వెళ్లారు. అక్కడ గొర్రెలు మేపుతూ అప్పారావు కనిపించాడు. ఆరా తీయగా.. తాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాడినని, తన గ్రామానికి వెళ్లకుండా 20 ఏళ్లకుపైగా అక్కడే పశువులను మేపుతున్నానని వివరించాడు. అప్పారావు దీనస్థితికి చలించిన కార్మిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిముత్తు.. తక్షణమే అతనిని విడిపించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో 20 ఏళ్ల వెట్టిచాకిరీ నుంచి బంధ విముక్తుడయ్యాడు.



20 ఏళ్ల కిందట టీ తాగేందుకు దిగి...

సుమారు 20 ఏళ్ల కిందట అప్పారావు అనే వ్యక్తి పనుల కోసమని కొంతమందితో కలిసి పాండిచ్చేరి బయల్దేరాడు. మార్గమధ్యంలో టీ కోసం రైల్వే స్టేషన్‌లో దిగాడు. ఆయన మరలా రైలు ఎక్కేలోపే అది వెళ్లిపోయింది. భాష రాదు, ఎటు వెళ్లాలో తెలియదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితుల్లో అక్కడే కొన్నాళ్లు చిక్కుకుపోయాడు. చివరికి కలెయిార్కోయిల్ ప్రాంతానికి చేరుకున్నాడు. శివగంగ జిల్లాలోని కలెయిార్కోయిల్ తాలూకా కదంబంకుళం ప్రాంతంలో అన్నాదురై అనే వ్యక్తి మాటలు నమ్మి, బతుకుదెరువు కోసం అక్కడ పనికి కుదిరాడు. నాటి నుంచి గొర్రెల కాపరిగా అక్కడే మగ్గిపోయాడు. పని చేసిన కాలానికి రూపాయి కూడా జీతం లేదు. వెట్టిచాకిరీ తప్ప. ఎటు వెళ్లాలో తెలియదు. ఎవరితోనూ మాట్లాడే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలోనే 20 ఏళ్లు గడిచిపోయాయి. సొంత ఊరికి వెళ్లిపోతానని, ప్రయాణానికి డబ్బులు కావాలని ఎన్నోసార్లు యజమానికి ప్రాధేయపడినా.. ఫలితం లేకపోయింది.

పార్వతీపురమే గానీ..

20 ఏళ్లు అయిపోవడం.. అప్పటి నుంచి తనతో తెలుగు మాట్లాడేవారు ఎవరూ సరిగ్గా లేకపోవడమో ఏమో గానీ.. పేరు కోనేరు అప్పారావు అని, ఊరు విజయనగరం జిల్లా పార్వతీపురం (అప్పట్లో ఉమ్మడి జిల్లా) అని మాత్రమే అక్కడి అధికారులకు చెప్పగలుగుతున్నాడు. తమిళం, తెలుగు కలిపి మాట్లాడటం వల్ల అధికారులూ పూర్తి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు. ఎలాగైనా తనను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని ఆయన ప్రాధేయపడటంతో, అక్కడి శివగంగ జిల్లా కలెక్టర్.. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను ఇటీవల ఫోన్‌లో సంప్రదించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం జిల్లా అధికారులు గ్రామంలో సంప్రదించి, ఫొటో చూపించినా.. ఎవరూ గుర్తించలేకపోయారు. ప్రస్తుతం అప్పారావు అక్కడే పునరావాస కేంద్రంలో ఉన్నాడు.

> **అప్పారావు కుటుంబ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం..**
>
> ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన అప్పారావు అనే వ్యక్తి 20 ఏళ్ల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటూ, తమిళనాడుకు చెందిన అన్నాదురై దగ్గర గొర్రెల కాపరిగా పని చేస్తున్నట్లు తమిళనాడు కార్మిక శాఖ అధికారులు గుర్తించారు. అప్పారావు చెబుతున్న ప్రాంతం ఒడిశా సరిహద్దులో ఉన్నట్లు ఆయన చెబుతున్న వివరాలు ఆధారంగా తెలుస్తోంది. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు కూడా వాటిని పరిశీలించాలని ఆదేశించాం. ఎవరికైనా అప్పారావు కుటుంబ ఆచూకీ లభ్యమైతే సమాచారాన్ని ఫోన్ 83338 13243 నంబరుకు తెలియజేయాలి.
>
> – ఎ.శ్యాంప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

పదో తరగతి సైన్స్ ప్రశ్న పత్రంలో తప్పిదం

- నిష్పాక్షిక మూల్యాంకనానికి బీఎస్ఈ హామీ

భువనేశ్వర్: మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) నిర్వహిస్తున్న హై స్కూల్ సర్టిఫికెట్ (హెచ్ఎస్సీ) పరీక్షలో సైన్స్ ప్రశ్న పత్రంలో తప్పు దొర్లింది. శనివారం ఈ పొరపాటు జరిగింది. సెట్–సి ప్రశ్న పత్రంలో 4 మార్కులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఒక ప్రశ్న ముద్రితం కాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు ప్రాథమిక సమాచారం. సైన్స్ సెట్–సి పేపర్‌కు నిర్దేశించిన మొత్తం మార్కుల కంటే నాలుగు మార్కులు తక్కువగా కేటాయించినట్లు విద్యార్థులు గుర్తించారు. తక్షణమే ఈ పరిస్థితిని ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకుని వెళ్లారు. అంచెలంచెలుగా ప్రశ్న ప్రతంలో లోపం రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. తక్షణమే పరిస్థితి సమీక్షించి నిష్పాక్షికంగా విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటామని బోర్డు అధ్యక్షుడు అభయం ఇచ్చారు.



శ్రీకాంత్ తొర్రై, బీఎస్ఈ అధ్యక్షుడు

విద్యార్థుల తెలియజేసిన వివరాల ప్రకారం సైన్సు 'సి' సెట్ పేపర్‌లో 4 మార్కుల ప్రశ్న లేదు. ఫలితంగా, వారు అనుకున్న 50 మార్కులకు బదులుగా 46 మార్కుల పేపర్‌కు సమాధానం ఇవ్వడం అనివార్యం అయింది. మూల్యాంకనం పురస్కరించుకుని తలెత్తబోయే పరిస్థితుల పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఈ పరిస్థితుల పట్ల మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) అధికార వర్గం సానుకూలంగా స్పందించింది. తప్పిదం గుర్తించినట్లు ధ్రువీకరించింది. జవాబు పత్రాలు దిద్దడం మూల్యాంకనం దశలో ఈ నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్ని న్యాయసమ్మతంగా పరిష్కరించేందుకు విద్యావేత్తలు తదితర నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీ పని చేస్తుందని బీఎస్ఈ అధ్యక్షుడు శ్రీకాంత్ తొర్రై వివరించారు. ప్రశ్న పత్రంలో 4 మార్కులు తక్కువగా ఉన్నప్పటికి మూల్యాంకనంలో విద్యార్థులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా బోర్డు అన్ని జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించిందని ప్రకటించారు.

క్లుప్తంగా

ఆకాశవాణిలో బద్రి ప్రసంగం


ప్రసంగిస్తున్న బద్రి కూర్మారావు

పలాస: మండలంలోని రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు జానపద కళల పరిశోధకుడు బద్రి కూర్మారావు విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రంలో శనివారం ఉత్తరాంధ్ర గిరిజన తెగలు–సంస్కృతి అనే అంశంపై ప్రసంగించారు. సవర, జాతాపు, గదభ, కొండదొర, మన్నెదొర, కొండ రెడ్లు, భగత వాల్మీకి తదితర 20 ఆదివాసీ తెగల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, పాటలు తదితర అంశాలను వివరించారు. ఆదివాసీ సంస్కృతి చాలా గొప్పదని, నాగరకత పెరుగుతున్న కొలదీ ఆదివాసీలు తమ భాషను, సంస్కృతిని మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను కాపాడుకోవాలని కోరారు. కాగా, ఈ నెల 8, 9, 10 తేదీల్లో తిరుపతిలో జరగనున్న భారత జనపద విజ్ఞాన సదస్సులో పాల్గొని ఉత్తరాంధ్ర జానపద కళలు, సాహిత్యంపై పత్రాలు సమర్పిస్తున్నట్టు బద్రి కూర్మారావు చెప్పారు.

ప్రతిభకు ప్రశంసలు


ఎస్‌ఐ హరికృష్ణకు ప్రశంసాపత్రం అందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రాపర్టీ, చైన్ స్నాచింగ్, దొంగతనాల వంటి కేసులు ఛేదించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షలో సీఐలు, ఎస్‌ఐలకు డీఎస్పీ సీహెచ్ వివేకానంద సమక్షంలో ప్రశంసాపత్రాలను అందించారు. గార మండలం శాలిహుండంలో 17 తులాల బంగారం కేసులో కీలక పాత్ర పోషించిన ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ వీరిలో ఉన్నారు.

‘శిష్టకరణ సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదు’

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణ రాష్ట్ర సంఘానికి ఎటువంటి ఎన్నికలు నిర్వహించలేదని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘంలెపి 45 బ్రాంచీల అధ్యక్షులు ఎన్నికలకు ముందుకు వచ్చిన సందర్భంలో తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా, కార్యదర్శిగా పాత వర్గాన్ని కొనసాగించాలని అందరూ తీర్మానించిన సందర్భంలో ఎన్నికలు అవసరం లేదని నిర్ణయించినట్లు తెలిపారు. ఓబీసీ సాధన జరిగిన తర్వాత ఎన్నికల ప్రస్తావన తెరపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. స్వలాభం కోసం నలుగురైదుగురు కలిసి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నిక అని ప్రకటిరచడం సరికాదన్నారు. తమ దృష్టికి తీసుకురాకుండా ఎవరైనా నిర్ణయాలు తీసుకుంటే, అటువంటి వారిని రాష్ట్ర కార్యవర్గం నుంచి తప్పిస్తూ క్రమశిక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

జిల్లా క్రికెటర్లకు సత్కారం


సత్కారం అందుకున్న క్రికెటర్లతో అతిథులు, జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులు ముఖ్యంగా క్రికెట్‌లో అడుగుపెట్టినవారు నిర్దేశిత లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని అకుంఠిత దీక్షతో వాటిని అందిపుచ్చుకోవాలని ఏఎస్పీ ఆర్.వెంకటరమణ అన్నారు. 2024–25 సీజన్‌లో వివిధ విభాగాల్లో ఏసీఏ అంతర్ జిల్లాల, అంతర్‌జోనల్, స్టేట్, అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం ఘనంగా సత్కరించింది. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీఏ గేమ్స్ విభాగం జీఎం ఎంఎస్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా నుంచి త్వరలో మరో ముగ్గురికి రంజీల్లో ప్రవేశం లభించే అవకాశముందన్నారు. ఇప్పటికే స్టార్ ఆల్‌రౌండర్ త్రిపురాణ విజయ్‌కు ఐపీఎల్‌లో ఎంట్రీ లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో 2021–22 తర్వాత జిల్లా క్రికెట్ సంఘం సాధించిన ప్రగతి, క్రికెట్ క్రీడాకారుల ఫలితాలను జెడ్‌సీఎస్ మెంటార్ ఇలియాస్ మహ్మద్ వివరించారు. నిరుపేద క్రీడాకారులకు షూ, బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్ వందాన మురళీమోహన్, క్రీడా ప్రోత్సాహకులు దుప్పల వెంకట్రావు, జెడ్‌సీఎస్ కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ సువ్వారి రవికుమార్, గుంట పురుషోత్తమ నాయుడు, రవికిరణ్, క్రీడాకారులు త్రిపురాన విజయ్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్, ఎస్.హిమకర్, ఆర్.జున్నారావు, నంబల్ల సుశాంత్, మొదలవలస పూర్ణచంద్ర, శిమ్మ సాత్విక్, సీహెచ్ యోజిత్, జోగేంద్ర, వివేక్‌నందా, వ్రతకిరణ్, ఎస్‌పీ ప్రేరణ్, కె.హిమచంద్ర, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభద్రశక్తి మేళా ప్రారంభం


మేళాను ప్రారంభిస్తున్న అతిథులు


గిరిజనులు ఏర్పాటు చేసిన వస్త్రాల స్టాల్స్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యేలు


వేదికపై ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్


గిరిజనుల సామగ్రిని పరిశీలిస్తున్న చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో


నృత్యంతో సందడి చేస్తున్న బొమా గురుకుల విద్యార్థులు


శాంతాలి నృత్యం


ఆదివాసీ నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని డీఎన్‌కే క్రీడా మైదానంలో శుక్రవారం రాత్రి సుభద్రశక్తి మేళాను అతిథులు ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మల్కన్‌గిరి,చిత్రకొండ ఎమ్మెల్యేలు నర్సింగ్ మడ్కమి, మంగుఖీలో, జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు తదితరులు హాజరయ్యారు. సుభద్ర యోజన కార్యక్రమంలో భాగంగా మహిళలకు సేంద్రియ ఉత్పత్తులు, హస్తకళలపై అవగాహన కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో 150 స్వయం సహాయక బృందాలు ఉన్నాయన్నారు. మహిళా స్వయంశక్తి సంఘాలు సభ్యులు ఏర్పాటు చేసిన వివిధస్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. మేళా ఏడురోజులు కొనసాగునుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – మల్కన్‌గిరి

కొరాపుట్‌లో హాట్ ఎయిర్ బెలూన్ సేవలు


కొరాపుట్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న హాట్ ఎయిర్ బెలూన్




కలెక్టర్ వీ.కీర్తి వాసన్ బృందం పర్యటన

కొరాపుట్: కొరాపుట్ జిల్లాకి వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడానికి హాట్ ఎయిర్ బెలూన్ సేవలు అందబాటులోకి రానున్నాయి. శనివారం కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తి వాసన్ సమక్షంలో ఈ బెలూన్ పని తీరుని రెండు సార్లు టెస్ట్ చేయించారు. రానున్న శీతాకాలంలో వచ్చే పర్యాటకులను ఇవి అలరించనున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ ఈ సేవలు అందుబాటులోకి రావడానికి డీజీసీఏ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అనుమతి రావాల్సి ఉందన్నారు. కొరాపుట్ జిల్లాలోని దండకారణ్యంలో ప్రకృతి అందాలు తిలకించడానికి దేశ విదేశాల నుంచి ఏటా అసంఖ్యాక పర్యాటకులు వస్తుంటారు.

నేర పరిశోధనలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం

• డీఐజీ నితిశేఖర్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఐజీ నితిశేఖర్

కొరాపుట్: నేర పరిశోధనలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సదరన్ వెస్ట్రన్ రేంజ్ డీఐజీ నితి శేఖర్ అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఇన్విస్టిగేషన్ యూనిట్ ఆఫ్ క్రైం ఎగినిస్ట్ ఉమెన్ (ఐయూసీడబ్ల్యూ) కార్యాలయాన్ని శనివారం ప్రారంభించన అనంతరం ఆయన మాట్లాడారు. భవనాన్ని రూ. 19 లక్షల వ్యయంతో నిర్మించినట్టు పేర్కొన్నారు. ఈ యూనిట్ మహిళలపై జరిగే నేరాలపై ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. మహిళలకు రక్షణ గా ప్రత్యేక టీం ఉంటుందని డీఐజీ వెల్లడించారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ మిహిర్ కుమార్ పండా పాల్గొన్నారు.

ఏడీఎం మహేశ్వర్ చంద్ర నాయక్‌కి ఘన వీడ్కోలు


నబరంగ్‌పూర్ ఏడీఎం మహేష్ నాయక్ కి వీడ్కోలు చెబుతున్న కలెక్టరేట్ ఉద్యోగులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా అదనపు మెజిస్ట్రేట్ మహేశ్ చంద్ర నాయక్‌కి స్థానిక సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు. మహేష్ చంద్ర నాయక్ జయపూర్‌లోని విక్రం దేవ్ యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా పదోన్నతిపై వెళ్లనున్నారు. గత మూడేళ్లుగా మహేష్ చంద్ర నబరంగ్‌పూర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేసిన సేవలను రెవెన్యూ సంఘాలు కొనియాడాయి.

ప్రజలను విస్మరిస్తున్న ప్రభుత్వం


కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆప్ పార్టీ నాయకులు

• ఆప్ నాయకుల ఆందోళన

రాయగడ: కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ సర్కార్ ప్రజలను విస్మరించి పాలన చేస్తోందని అమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద శనివారం ఆప్ జిల్లా అధ్యక్షుడు జన్మాజయ్ స్వయి నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు దుర్గా పరిడ (కటక్), గంజాం జిల్లా కన్వీనర్ సుభాస్ రౌత్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆశీష్ పాండే తదితరులు పాల్గొన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందించారు. ఈ సందర్భంగా జన్మాజయ్ స్వయి మాట్లాడుతూ.. అసత్య ప్రచారాలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్‌పై దుమ్మెత్తి పోశారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన ఆ పార్టీ నాయకులపై విమర్శనాస్త్రాలను సంధించారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలను మభ్యపెట్టి 25 ఏళ్ల రాష్ట్రాన్ని ఏలిన బీజేడీ పార్టీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని.. అదేతరహాలో బీజేపీ కూడా పతనస్థాయికి చేరుకుంటుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులకు 300 యూనిట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాల, స్థానిక మజ్జిగౌరి మందిరాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించి ఆ దిశగా అభివృద్ధి చేయాలని, చిట్ ఫండ్ బాధితులను ఆదుకోవాలని కోరారు.

మహిళలపై పెరుగుతున్న హింస


ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

• పీసీసీ అధ్యక్షుడు భక్తి చరణ్ దాస్

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళల భద్రత ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. మహిళలపై జరుగుతున్న దాడులకు సీఎం బాధ్యతవహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి విఫల యత్నం చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక మాస్టరు క్యాంటీన్ ఛక్ ప్రాంతంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్ ఈ ఆందోళనకు సారథ్యం వహించారు. ఈ ఆందోళనలో భువనేశ్వర్ జిల్లా కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎనిమిది నెలల పాలనలో తరచు సిగ్గుచేటు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. కొద్ది నెలల్లోనే 54 అత్యాచార ఘటనలు ప్రభుత్వ శాంతిభద్రతల వైఫల్యానికి అద్దం పడుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు అన్నారు. బాలాసోర్ జిల్లా సొరొ, ఢెంకనాల్, సంబల్‌పూర్, రొర్కెలా, బొలంగీర్ జిల్లా ఖైరాపల్లి, కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్, భద్రక్ జిల్లా బెత్తాడా, దేవగడ్, బర్‌గడ్ ప్రాంతాల్లో పలు సందర్భాల్లో మహిళలపై అత్యాచార ఘటనలు రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అశాంతిని కలిగించాయన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని భక్త చరణ్ దాస్ ఆరోపించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

జయపురం:

కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో గల ప్రదీకరణ సభాగృహంలో శనివారం షడక్ సురక్షా సచేతన శిబిరాన్ని నిర్వహించారు. మోటారు వాహనాలు నడిపే సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచార పతి సుమన్ జెన హాజరయ్యారు. మోటారు వాహనాల చట్టం, నేరం చేసినవారికి శిక్షలు, డ్రైవర్ల లైసెన్స్‌లు, జాతీయ ట్రాన్స్‌పోర్టు నియమాలను పారాలీగల్ సేవకులు, మహిళా స్వయం సహాయక గ్రూప్ సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లకు వివరించారు. వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని వివరించారు. ప్రథమ శ్రేణి న్యాయాధికారి అనిమేష్ జెన, ఛీఫ్ లీగల్ డిప్యూటీ సెల్ కౌన్సిలర్ కె.దివాకర రావు, హరిశ్చంద్ర ముదులి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిప్యూటీ కౌన్సిల్ గీతాంజలి దోల్, పేనల్ న్యాయవాది కె.సత్యనారాయణ ఆచారి, నవీణ సాహు, బినయ బిశ్వాస్, దావాకర గౌడ తదితరులు పాల్గొన్నారు.

బిలామాల్‌లో శీతల గిడ్డంగి ప్రారంభం


శీతల గిడ్డంగి ప్రారంభోత్సవంలో కర్మాగారం అధికారులు, రైతులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ దొరగుడ గ్రామం ఉత్కళ అల్యూమిన కార్మాగారం సీఎస్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో బిలామాల్ గ్రామంలో సోలార్‌తో నడిచే ఐదు మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల శీతల గిడ్డంగిని ప్రారంభించారు. ఉత్కళ అల్యూమిన కర్మాగారం చీఫ్ రవినారాయణ మిశ్రో, హిండాల్ కో ఇండ్రస్ట్రీస్ సీఎఫ్‌వో భరత్ గోయాంక్, భాస్కర బెనర్జీ, సీఎస్‌ఆర్ విభాగం అధికారి లోపముద్రా మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేకపొవడంతో పాటు పండిన పంటను భద్రపరిచేందుకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం గమనించిన కర్మాగారం ఈ మేరకు శీతల గిడ్డంగిని ఏర్పాటు చేసిందని అన్నారు. రైతులు ఈ సౌకర్యాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

అదుపు తప్పిన ట్యాంకర్

• ఆశ్రమ పాఠశాల గోడను ఢీకొట్టిన వైనం
• డ్రైవర్‌కు గాయాలు


గోడ లోపలకు దూసుకుపోయిన ట్యాంకర్ ముందుభాగం


గోడను ఢీకొట్టిన ట్యాంకర్

రాయగడ: కాకినాడ నుంచి ఝార్సుగుడ వైపు వెళుతున్న ఒక ట్యాంకర్ అదుపుతప్పి పక్కనే గల ఆశ్రమ పాఠశాల గోడను ఢీకొట్టింది. ఈ ఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి గోతిగుడ వద్ద శనివారం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో విద్యార్థులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్ లోపల ఇరుక్కుపోయి గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణాలను అన్వేషిస్తున్నారు.

37 మందికి శస్త్ర చికిత్సలు


విశ్రాంతి తీసుకుంటున్న ఆపరేషన్ చేయించుకున్నవారు

జయపురంం: జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన వక్రపాద ఆపరేషన్ శిబిరంలో 37 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఆపరేషన్ చేయించుకున్నవారిలో ఆరు నెలల శిశువుల నుంచి 18 ఏళ్ల యువలకు ఉన్నారని రాష్ట్రీయ బాల సురక్షా కార్యక్రమ మేనేజర్ బిశ్వరంజన్ ముండ వెల్లడించారు. ఆపరేషన్ అయిన వారంతా 21 రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంటారన్నారు. సామాజిక సురక్షా దివ్యాంగ సశక్తీకరణ విభాగం, ఆర్‌బీఎస్‌కేల ద్వారా ఏర్పాటు చేసిన శిబిరంలో నవరంగపూర్, మల్కనగిరి, కొరాపుట్ జిల్లాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారన్నారు. ఆపరేషన్ చేయించుకున్నవారిలో మల్కన్‌గిరి జిల్లాకు చెందిన ముగ్గురు, నవరంగపూర్‌కు చెందిన ఆరుగురు, కొరాపుట్ జిల్లాకు చెందిన 28 మంది ఉన్నారన్నారు. వైద్యులు కిశోర్ చంద్రమహాపాత్రో, పవిత్ర కుమార్ సాహు, సత్యనారాయణ రావు, ప్రమోద్ కుమార్ పొరిడ, సంతోష్ పారియరథ్ సేవలు అందించారు.

శ్మశాన వాటిక ఆక్రమణ తగదు


జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పొరజ ప్రజలు

జయపురం: జయపురం మున్సిపాలిటీ పరిధి లింగరాజనగర్–కొత్త బస్టాండ్ మధ్య స్థలాన్ని ఎంతో కాలంగా పొరజ సంప్రదాయ ప్రజల శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారని, ఆ స్థలాన్ని కొందరు ఆక్రమణ చేస్తున్నారని పరజ సంప్రదాయ ప్రజలు ఆరోపిస్తున్నారు. పొరజ ప్రజలు శనివారం జయపురం అదనపు కలెక్టర్, జయపురం తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు. కొంత మంది శ్మశానంలో గల సమాధులు పడగొట్టి చదును చేస్తున్నారన్నారు. రాజుల కాలం నుంచి శ్మశానంగా వినియోగిస్తున్నట్లు పట్టణంలోని 8 వీధుల్లో ఉన్నవారు తెలిపారు. ఆక్రమణ దారులపై చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపడతామని బంగ్లాబెడ, పటనాయక్ గుడ, హనగుడ, నొడియబెడ సాహి, జామబెడ సాహి, ఖతుర సాహి, నువా సాహి, ఖెందుగుడ ప్రజలు హెచ్చరించారు.

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూలు రేపు

బొబ్బిలి: పట్టణంలోని రాజా కాలేజ్‌లో దివిస్ ల్యాబ్స్ కంపెనీ ప్రతినిధులు సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ లేదా ఎనలటికల్ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, బి ఫార్మసీ కోర్సులు చేసిన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 2000- 2005 సంవత్సరాల మధ్య విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని నేరుగా కళాశాలలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

యువకుడిపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయి ఇంటికి వెళ్లి దాడి చేసిన అబ్బాయిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కె. మురళీధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురానికి చెందిన అమ్మాయి తన చుట్టాలబ్బాయితో కొమరాడ మండలంలోని గుంప వెళ్లి వస్తుండగా.. శివిని గ్రామం వద్ద నిందితుడు వాళ్ళిద్దర్నీ అడ్డుకొని తాను ప్రేమించిన అమ్మాయితో నీకేంటి పని అని గద్దిస్తూ చుట్టాలబ్బాయిని బెదిరించాడు. అక్కడితో ఆగకుండా అమ్మాయి ఇంటికి వెళ్లి దుర్భాషలాడుతూ అమ్మాయిపై చేయి చేసుకున్నాడు. ఈ మేరకు అమ్మాయి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి

- డీపీఓ వెంకటేశ్వరరావు



సేంద్రియ ఎరువు తయారీపై సూచనలు చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

రాజాం సిటీ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలని డీపీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని సోపేరు గ్రామంలో శనివారం ఆయన పర్యటించి, వర్మీకంపోస్టు తయారీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో క్లాప్‌మిత్రలు సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రంలో పూర్తిగా వేరు చేయాలని సూచించారు. తడిచెత్తను బయట ఏర్పాటు చేసిన ఫిట్స్‌లో వేయాలని, పొడి చెత్తను కేంద్రం లోపల డ్రై ఫిట్స్‌లో వేయాలన్నారు. ప్రతి ఒక్క పంచాయతీలో సందప సృష్టిపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ పట్నాయక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాల్టీ పరిధి వస్త్రపురి కాలనీకి చెందిన ఆగూరు తిరుపతిరావు అనే వృద్ధుడు సైకిల్‌పై అమ్మవారి గుడి సమీపంలోని యోగాశ్రమానికి వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన మోటార్‌సైక్లిస్ట్ ఢీ కొనడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి అతన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. క్షతగాత్రుడి అన్నయ్య ఆగూరు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

స్వగ్రామానికి ఎంటెక్ విద్యార్థి మృతదేహం

- మూడు రోజుల కిందట సూరత్‌లో జరిగిన ప్రమాదంలో మృతి



పత్తిగిడి నాగరాజు(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట గ్రామానికి చెందిన యువకుడు పత్తిగిడి నాగరాజు (25) గత నెల 27న గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. అక్కడి రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని సెల్‌ఫోన్ ఆధారంగా స్నేహితులకు సమాచారం అందించారు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో హైదరాబాద్‌లో ఉన్న మృతుడి అన్నయ్య చిరంజీవి సూరత్ వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామమైన పూతికపేట గ్రామానికి శనివారం తీసుకువచ్చారు. నాగరాజు ఐదు నెలల కిందటే సూరత్‌లోని ఎన్ఐటీలో ఎంటెక్ చేసేందుకు వెళ్లాడు. తమ కుమారుడు తరుచూ ఫోన్‌లో మాట్లాడుతుండేవాడని, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు.

సహనం నేర్పే రంజాన్..

- నేటి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం
- నెల రోజుల పాటు కఠిన దీక్షలు, దానధర్మాలు
- ప్రార్థనలకు ముస్తాబైన మసీదులు



మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: యావత్ ప్రపంచంలో ఉన్న ముస్లింలకు అత్యంత పవిత్రమైన, సంతోషాలు పంచే నెల రంజాన్. ఈ నెల అరబీ నెలల వరుస క్రమంలో తొమ్మిదవది. రంజాన్ అంటే కాలిపోవడం, భస్మీపటలమవ్వడం, ఆగిపోవడం అనే అర్థాలను సూచిస్తుంది. రంజాన్ నెలలో తమ పాపాలు, పొరపాట్లు, తప్పిదాలన్నీ కాలిపోయి వాటికి బదులుగా పుణ్యఫలాలు పొందుతామనేది ముస్లింల నమ్మకం. ఈ శుభాల సరోవరం, వరాల వసంతం అయిన రంజాన్ మాసం నెల వంకను చూసిన వెంటనే ప్రారంభమవుతుంది. ఈ నెలకు అల్లాహ్ దృష్టిలో పవిత్రమైన, ప్రత్యేకమైన స్థానముంది. విశ్వాసులకు ఎనలేని సంతోషాలు, పుణ్యాలను అందిస్తుంది ఈ మాసం. ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లలు మొదలుకుని వృద్ధుల వరకు ఈ పవిత్రమాసం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉంటారు. ఆదివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించాలని జమాతే ఇస్లామీ హింద్ సంస్థ మతాధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలకు మసీదులన్నీ విద్యుత్ అలంకరణలతో ముస్తాబయ్యాయి.



నెలవంక

ఆలయ కమిటీల ప్రతినిధులు అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

ఉచితంగా నమాజ్ పుస్తకాల పంపిణీ...

రంజాన్ మాసంలో ఉచితంగా నమాజ్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు పట్టణ ముస్లిం ప్రతినిధి మహమ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాలు, మండలాల్లో 38 వేల నమాజ్ పుస్తకాలను పంపిణీ చేపట్టనున్నామన్నారు. అవకాశం ఉన్నవారందరూ పుస్తకాలను స్వీకరించాలని కోరారు.



ప్రార్థనలకు సిద్ధమవుతున్న జామియా మసీదు

ఈ నెల ప్రత్యేకతలు

- 30 రోజుల పాటు ప్రపంచంలో ముస్లిలందరూ ఉపవాస దీక్షలు పాటిస్తారు.
- మానవుల మార్గదర్శక గ్రంథం, చివరి దైవ గ్రంథం దివ్య ఖురాన్ అవతరించింది ఈ నెలలోనే. దీనికి కృతజ్ఞతగానే ముస్లింలు ఉపవాసాలు పాటిస్తారు.
- ఈ నెలలో చేసే ప్రతి చిన్న పుణ్యకార్యానికీ 70 రెట్ల నుంచి 700 రెట్ల పుణ్యం లభిస్తుంది.
- దైవత్వం ఈ నెలలో నరక ద్వారాలను మూసివేయిస్తారని, స్వర్గ ద్వారాలను మాత్రమే తెరిచి ఉంచుతారని, సైతాన్‌లను బందిస్తారని ముస్లింల నమ్మకం.
- పేదలు, అవసరార్థులు, వితంతువులు, అనాథలు, బాటసారులకు సేవా కార్యక్రమాలు చేపడతారు.

పాపాల నుంచి రక్షించుకునే అవకాశం



మనిషి తాను చేసిన పాపాల నుంచి రక్షించుకునే అవకాశం భగవంతుడు కల్పించాడు. ఖురాన్ పఠనం ద్వారా ప్రతి ముస్లింలో వ్యక్తిత్వ వికాసం జనిస్తుంది. రంజాన్ నెల దైవభీతి, నైతికత, సహన గుణం నేర్పిస్తుంది. ఈ నెల మిగతా 11 నెలలకు ఒక శిక్షణా కాలం వంటిది. ఖురాన్ పఠిస్తూ ఇతరులకు సేవ చేయాలి. ఈ నెలలో లభించిన సుగుణాలు మిగతా నెలల్లో వికసిస్తాయి. – మహ్మద్ హబీబ్, జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు, విజయనగరం

అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు



రంజాన్ మాసం ప్రారంభం కావడంతో అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తాం. దేశం అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, ముస్లిం సోదరులందరూ ప్రత్యేక నమాజ్‌లు చేయనున్నారు. పవిత్ర ఖురాన్ గ్రంథం చదవడం, ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. – అబ్దుల్ కరీమ్, వక్ఫ్‌బోర్డ్ మాజీ అధ్యక్షుడు, విజయనగరం

ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లుగా రిసెప్షన్ కౌంటర్లు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్ స్టేషన్‌లలో ఉన్న రిసెప్షన్ కౌంటర్లు ఇకపై ఉమెన్ హెల్ప్ డెస్క్‌లుగా మారుస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షనిస్టులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఉమన్ హెల్ప్ డెస్క్‌ ఒక మహిళా ఏఎస్సై, హెచ్‌సీ, మహిళా పీసీలను నియమిస్తామన్నారు. బాధితులు ఫిర్యాదు రాయలేకపోతే సిబ్బందే వారి ఫిర్యాదులను రాయాలని సూచించారు. ఫిర్యాదు తీసుకున్న తర్వాత ఆయా అంశాలను రిసెప్షన్ రిజిష్టర్‌లో నమోదు చేసి బాధితులకు రశీదు ఇవ్వాలన్నారు. అనంతరం విషయాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌ నియమించిన సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు అందుబాటులో ఉండాలన్నారు. గొడవల కారణంగా బాధితులు ఎవరైనా తిరిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటే వారిని స్వధార హోమ్, వన్‌స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, వన్‌స్టాప్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన ఎస్‌హెచ్‌ఓలు, హెల్ప్‌డెస్క్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పొట్టేళ్ల పందాలపై దాడులు



పట్టుకున్న పొట్టేలుతో పోలీసులు

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామ శివారులో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై శనివారం తెల్లవారుజామున ఎస్సై జి.కళాధర్ సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ఒక పొట్టేలు, రూ. 1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

- రూ. 3 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

వీరఘట్టం: మేజర్ పంచాయతీ పరిధి దుర్గగుడి సమీపంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ధర్మవరపు పార్వతికి చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ. 1.50 లక్షల నగదుతో పాటు పది కోళ్లు, టీవీ, ఫ్యాన్లు, బీరువా, నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. ఒక్కసారిగా వ్యాపించిన మంటలను చూసి స్థానికులు పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక అధికారి జామి సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి మృతి



బండమ్మ (ఫైల్)

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని గొట్నంది గ్రామానికి చెందిన బొడ్డు బండమ్మ (66) శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందింది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బండమ్మ నులక మంచంపై పడుకుని కిందన అగ్గి కుంపటి పెట్టుకుని నిద్రలోకి జారుకుంది. దీంతో కుంపటి నుంచి మంటలు వ్యాపించడంతో మంచం కాలిపోయి బండమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు స్పందించి బండమ్మను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బండమ్మ కుమారుడు పెదబండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య



రమణ (ఫైల్)

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన సంచాన రమణ (39) శుక్రవారం సాయంత్రం తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గరివిడి పోలీసులు శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రమణ తొమ్మిదో తరగతి చదువుతున్న తన కుమార్తె శ్యామలను మందలిస్తూ చేయి చేసుకున్నాడు. దీంతో అతని భార్య కమల కుమార్తెను ఎందుకు కొట్టావని ప్రశ్నించింది. దీంతో మనస్తాపానికి గురైన రమణ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమణ పైడిభీమవరం కంపెనీలో లేబర్‌గా పనిచేస్తుండగా.. అతని భార్య కమల అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెమికల్ తాగి వ్యక్తి మృతి..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు పంచాయతీ పరిధి వైఎస్సార్ కాలనీకి చెందిన పిన్నింటి పాపారావు (50) నీరు అనుకుని పొరపాటున అరటిపండ్లు మగ్గించే రసాయనం తాగి మృతి చెందాడు. గరివిడి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాపారావు వైఎస్సార్ కాలనీలో గల తన ఇంటిలో పడుకుని శనివారం సాయంత్రం నిద్ర లేచాడు. ఈ క్రమంలో దాహంగా ఉండడంతో ఎదురుగా వాటర్ బాటిల్‌లో అరటిపండ్లను మగ్గించేందుకు ఉంచే రసాయనాన్ని నీరు అనుకుని తాగేశాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న పాపారావును కుటుంబ సభ్యులు చీపురుపల్లి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేయగా.. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. మృతుని కుమారుడు పిన్నింటి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగభూషణం మృతదేహం

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. పట్టణంలోని గౌరీనగర్‌కు చెందిన సరిత నాగభూషణం(55) అనే ఉదయం 8.30 గంటల సమయంలో కొత్తవలసలోని కుమార్తె ఇంటికి వెళ్లాలని బయటకు వచ్చాడు. రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడిచి వెళ్తుండగా.. అప్పుడే యూ టర్న్ తీసుకున్న ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు నాగభూషణంను ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగభూషణంను ప్రభుత్వాస్పత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్..



శివగణేష్ మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి, భార్య, బంధువులు



మృతుడు శివగణేష్ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన ఉదయాన శివగణేష్(28) అనే ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, అతని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యక్తిగత పనిమీద శివగణేష్ శనివారం ఉదయం వీరఘట్టం బయలుదేరాడు. ఇదిలా ఉంటే వీరఘట్టం హైస్కూల్ ఎదురుగా ఉన్న మెకానిక్ షెడ్డు వద్ద కృష్ణ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించుకుని వీరఘట్టం వైపు వస్తున్నాడు. ఇంతలో శివగణేష్ వీరఘట్టం వెళ్లేందుకు అతనికి లిఫ్ట్ అడిగాడు. తెలిసిన వ్యక్తి కావడంతో కృష్ణ అతనికి ట్రాక్టర్ ఎక్కమనగా.. శివగణేష్ ఇంజిన్‌కు ట్రాక్టర్ తొట్టికు మధ్య రాడ్డుపై ఎక్కాడు. సరిగ్గా తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సీఎస్పీ రోడ్డు వద్దకు వచ్చేసరికి శివగణేష్ అదుపుతప్పి పడిపోవడంతో, తొట్టి చక్రాలు అతని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై జి.కళాధర్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మృతుడి తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రమ్య, ఏడాదిన్నరలోపు ఇద్దరు పిల్లలు, తల్లి రాజేశ్వరి ఉన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు




జగతపల్లి వ్యూపాయింట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట: మన్యంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాలను శనివారం ఆయన సందర్శించారు. జగతపల్లి వ్యూ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులను ఆకర్షించే విధంగా వ్యూ పాయింట్‌ను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పనుకువలస నర్సరీలో గ్రామదర్శిని కార్యక్రమం ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించి ఇక్కడ అనుకూలంగా ఉందన్నారు. గడిగుడ్డిలోని పట్టు పరిశ్రమ యూనిట్‌ను పరిశీలించారు. పట్టునుంచి దారం తీసే విధానాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పెదరామ గ్రామంలో మల్బరీ తోటలు పెంచే రైతులతో మాట్లాడారు. ఐటీడీఏలోని ముక్కిడిపోలమ్మ జీడి ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలించారు. కొండచీపుర్లు, అగరుబత్తి యూనిట్, పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, ఈఈ రమాదేవి, ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు

- జంట నగరాలకు కొత్త డీసీపీలు



భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ కేడర్‌లో భారీ బదిలీలు చేపట్టింది. భువనేశ్వర్, కటక్ జంట నగరాలకు కొత్త డీసీపీలు నియమితులయ్యారు. పోలీసు యంత్రాంగంలోని కీలక పదవుల్లోని సీనియర్ అధికారులను పునర్ వ్యవస్థీకరించారు. ప్రస్తుతం కటక్ డీసీపీగా పనిచేస్తున్న జగ్మోహన్ మీనాను భువనేశ్వర్ డీసీపీగా నియమించారు. కటక్ నగరం కొత్త డీసీపీగా ఖిలారి రిషికేశ్ ద్యాండియో నియమితులయ్యారు.

- ప్రస్తుతం ఒడిశా కటక్‌లోని ప్రింటింగ్, స్టేషనరీ, పబ్లికేషన్ డైరెక్టర్‌గా ఉన్న 1989 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి ఎస్. ఎం. నార్వాణే బదిలీ చేసి ఓహెచ్ఆర్సీ ప్రత్యేక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు.
- ప్రస్తుతం ఓఎస్ఆర్టీసీ చైర్మన్ – మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్న 1997 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి దీప్తేష్ కుమార్ పట్నాయక్ కటక్‌లోని ప్రింటింగ్, స్టేషనరీ, పబ్లికేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.
- ప్రస్తుతం ఒడిశా ప్రొవిజనింగ్‌లో అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న 2000 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి యతీంద్ర కోయల్‌ను బదిలీ చేసి మానవ హక్కుల పరిరక్షణ సెల్ అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ గా నియమించారు.
- 2002 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి ఎస్.ప్రవీణ్ కుమార్‌ని బదిలీ చేసి కటక్ సెంట్రల్ రేంజ్ ఐజీపీగా నియమించారు.
- ప్రస్తుతం అబ్కారీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న 2002 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి నర్సింగ్ భోల్‌ను బదిలీ చేసి భువనేశ్వర్, కటక్ జంట నగరాల అదనపు పోలీసు కమిషనరుగా నియమించారు.
- 2004 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి, ప్రస్తుత హోం గార్డ్స్, ఫైర్ సర్వీసెస్ ఐజీపీ డాక్టర్ దీపక్ కుమార్ ఆపరేషన్స్ ఐజీపీగా నియమితులయ్యారు.
- ఆపరేషన్స్ ఐజీపీగా పని చేస్తున్న 2005 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి జై నారాయణ్ పంకజ్ ఇంటెలిజెన్స్ ఐజీపీగా బదిలీ అయ్యారు.
- 2007 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి డాక్టర్ సార్థక్ షడంగిని క్రైం శాఖ సీఐడీగా బదిలీ చేశారు.
- 2007 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి నీతి శేఖర్ ని బదిలీ చేసి దక్షిణ శ్రేణి ఐజీపీగా నియమించారు.
- ప్రస్తుతం భువనేశ్వర్–కటక్ జంట నగరాల అదనపు పోలీసు కమిషనరుగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2008 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి డాక్టర్ ఉమాశంకర్ దాస్‌ను బదిలీ చేసి హోమ్ గార్డ్స్, ఫైర్ సర్వీసెస్‌గా డీఐజీగా నియమించారు.
- ప్రస్తుతం ఆపరేషన్ 1 డీఐజీగా ఉన్న 2009 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి అఖిలేశ్వర్ సింగ్‌ను నైరుతి రేంజ్ డీఐజీగా బదిలీ చేసి నియమించారు.
- 2009 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి చరణ్ సింగ్ మీనాని కటక్ ప్రొవిజనింగ్‌లో డీఐజీగా నియమించారు.
- ప్రస్తుతం భువనేశ్వర్ డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2011 సంవత్సరపు ఐపీఎస్ అభ్యర్థి పినాక మిశ్రాని బదిలీ చేసి భువనేశ్వర్ డీఐజీ, ఎస్‌టీఎఫ్‌గా నియమించారు.

ఉపాధ్యాయుడికి వినూత్నంగా నివాళులు



కుండీలో మట్టి వేస్తున్న దృశ్యం

కొరాపుట్: అనారోగ్యంతో చనిపోయిన ఉపాధ్యాయుడుకి తోటిసిబ్బంది, విద్యార్థులు వినూత్నంగా నివాళులర్పించారు. నబరంగ్‌పూర్ జిల్లా మహదేవ్ విద్యాలయంలో విష్ణురాజ్ ప్రధాన్ ప్రధాన ఉపాధ్యాయుడుగా పని చేసేవారు. విధి నిర్వహణలో ఉత్తమ బోధనతో మంచిపేరు తెచ్చుకున్నారు. ఈయన ఇటీవల కన్నుమూయడంతో సంతాభసభను పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఒక మొక్కను అతని పేరు మీద సభలో ఉంచారు. సభలో పాల్గొన్నవారంతా పిడికెడేసి మట్టిని మొక్క ఉంచిన కుండిలో వేశారు. మొక్కను రక్షించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేసి నివాళులర్పించారు.



విష్ణురాజ్ పేరు మీద కుండీలో ఉంచిన మొక్క, పక్కనే చిత్రపటం

ఇది మోసపూరిత బడ్జెట్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

వంగర: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి మోసపూరితంగా ఉందని.. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలకు, ఇప్పుడు బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతనే లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని మండిపడ్డారు. మండలంలోని కోనంగిపాడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని.. ఈ ఏడాది బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులు కేటాయించడం చూస్తుంటే.. ఆ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ఫ్రీ బస్, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలకు కేటాయింపులు లేకపోవడం అన్యాయమన్నారు. 50 ఏళ్లు పైబడిన బీసీలకు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ప్రజలు సీఎం చంద్రబాబును నమ్మి మోసపోయారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని.. పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా ప్రవేశపెట్టలేదని తెలిపారు. ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్యసేవగా పేరుమార్చి పథకాన్ని పూర్తిగా నీరుగార్చారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకెళ్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ వ్యయం కింద రూ.2.51 లక్షల కోట్లు కేటాయించి, మూలధన వ్యయం కింద కేవలం రూ.40 వేల కోట్ల కేటాయింపులు చేయడమే వారి మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందని తెలిపారు. తన మంత్రి పదవిని కాపాడుకునేందుకే పయ్యావుల కేశవ్ బడ్జెట్ సమావేశాల్లో చంద్రబాబు, లోకేష్‌లను పొగిడే దుస్థితికి దిగజారారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్‌లు చందక తాతబాబు, నెయిగాపుల శివరామకృష్ణయ్య, పార్టీ నాయకులు కనగల పారినాయుడు, వేమిరెడ్డి సూర్యనారాయణ, బెవర నూకంనాయుడు, యలకల వాసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.